క్లుప్తంగా

భక్తి భావంతో ప్రశాంతత



అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న సర్పంచ్ దంపతులు

షాబాద్: ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కుర్వగూడ గ్రామ సర్పంచ్ సంధ్య మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సర్దార్‌నగర్ కోట మైసమ్మ నూతన ఆలయంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బోనాల ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ బుయ్యని రాములుగౌడ్ జ్ఞాపకార్థం ఆలయం నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ సర్పంచ్ స్వరూప పాల్గొన్నారు.

ప్రొద్దటూరులో కంటి వెలుగు శిబిరం



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, ప్రొద్దటూరు సర్పంచ్ ఏ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదనే సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీ ప్రవల్లిక, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చేవెళ్ల తైబజారుకు వేలం

పంచాయతీకి రూ. 7.05లక్షల ఆదాయం

మొయినాబాద్/చేవెళ్ల: చేవెళ్ల తైబజారుకు శుక్రవారం వేలం నిర్వహించారు. సర్పంచ్ బీ శైలజారెడ్డి ఆధ్వర్యంలో వేలం సాగింది. పట్టణానికి చెందిన బీ శ్రీనివాస్ రూ. 7,05,100 వేలం పాడి తైబజారును దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠలేశ్వర్, ఉప సర్పంచ్ జీ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 167మంది గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏడు కేంద్రాల్లో 2,684 మంది విద్యార్థులకు గాను 2,517 మంది పరీక్షలు రాయగా, 167మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 481 మంది గాను 453 మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 223మంది గాను 214 మంది, ప్రతిభ కళాశాలలో 361 మందికి గాను 335మంది, విశ్వభారతి కళాశాలలో 495 మందికి గాను 475 మంది, విజ్ఞాన్ కళాశాలలో 576మందికి గాను 534మంది, విజేత జూనియర్ కళాశాలలో 341మందికి గాను 317మంది, శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో 207మందికి గాను 189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్ప తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల చేవెళ్ల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న ఓసీ, బీసీ విద్యార్థులు 9–11 సంవత్సరాల వయస్సు దాటని వారు, ఎస్సీ, ఎస్టీలు 13 సంవత్సరాలు దాటకూడదని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణ వాసులు రూ.2 లక్షలు మించకూడదని తెలిపారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

గడువు పెంపు

కొందుర్గు: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు కొందుర్గు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువును 20వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

కేశంపేట: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ రవీందర్ యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య జరుగుతుందని, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ ఆర్య క్షత్రియ



బొల్లారం పీఎస్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నేతలు

షాబాద్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ ఆర్య క్షత్రియ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నగరంలో తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మండలం నుంచి వెళుతున్న తనతోపాటు నాయకులను శుక్రవారం అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్ తరలించారని తెలిపారు. స్టేషన్‌లో దీక్ష కొనసాగించినట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాలు లీక్ చేసిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల హస్తం

షాద్‌నగర్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వానికి హితవు పలికారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీలో బీఆర్‌ఎస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష పత్రాలను లీక్ చేసిన నిందితుడు తన పెన్ డ్రైవ్‌లో వివిధ పరీక్షలకు సంబంధించిన పేపర్లను కాపీ చేసుకోవడాన్ని చూస్తుంటే అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రశ్న పత్రాలు బయటకు వచ్చాయన్నారు. ఇలా చేయడం వల్ల పరీక్షలు రాసిన చాలా మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఎన్నో ఏళ్ల తర్వాత ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షల నిర్వహణపై నియంత్రణ లేకపోవడంతో ప్రశ్న పత్రాలు లీకయ్యాయని అన్నారు. లిక్కర్ స్కాం నుంచి కవితను బయట పడేసేందుకు ఉన్న శ్రద్ధ సీఎం కేసీఆర్‌కు నిరుద్యోగులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, సుధాకర్, ఆకుల ప్రదీప్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

కొందుర్గు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు ఆ పార్టీ నియోజకవర్గ నేతలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ టీ రాములు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. పేపర్ లీకేజీకి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ దీక్షను విరమించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడు శ్రీను, నాయకులు దర్శన్, శ్రీనివాసు, ఉదయ్ కృష్ణ, నర్సింలు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

కేశంపేట: టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని స్వేరో జిల్లా కమిటీ అధ్యక్షుడు లింగం డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు కేశంపేట నుంచి స్వేరో జిల్లా కమిటీ అధ్యక్షుడు లింగం ఆధ్వర్యంలో పలువురు నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పరీక్ష పత్రాలు లీకే అయ్యాయని అన్నారు. నగరానికి వెళ్లిన వారిలో నేతలు జీ భీమయ్య, యాదగిరి, చంద్రయ్య, మల్లేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

షాద్‌నగర్ రూరల్: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వారిని అక్రమ అరెస్టులతో ఆపలేరని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు డీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మద్దతుగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దీక్ష చేస్తున్నందుకే ఆయనను అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రవీణ్‌కుమార్ దీక్షతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షను రద్దు చేసిందన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ. కోటి మంజూరు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మొయినాబాద్ రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ నక్షత్రం జే వంతు, జెడ్పీటీసీ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందితే ఆదర్శ మండలం అవుతుందన్నారు. గ్రామ స్థాయి అధికారులు వారివారి ప్రాంతాల్లోని సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, రోడ్లు, తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ మండల అధికారి మాట్లాడారు. గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి, అలాగే విద్యుత్ స్తంభాలు, తీగలు సరి చేయడానికి కోటి రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. 18 గ్రామాల్లో వివిధ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారు చేపట్టిన అభివృద్ధి పనులను సభకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మమత, మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, పంచాయతీ రాజ్ ఏఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పట్టించుకోరా?

సర్పంచ్‌ను నిలదీసిన యువజన సంఘం సభ్యులు

షాబాద్: గ్రామంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోరా అంటూ యువజన సంఘం సభ్యులు సర్పంచ్‌ను నిలదీశారు. శుక్రవారం మండలంలోని మాచన్‌పల్లిలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి వదిలేశారని, అందులో పరికరాలు లేవన్నారు. గేటు కూడా పెట్టలేదన్నారు. క్రీడా ప్రాంగణంలో పశువును కట్టేస్తున్నారని తెలిపారు. అలాగే గ్రామంలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెండు సార్లుగా సర్పంచ్‌గా గెలిపిస్తే మీరు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. నగరంలో ఉంటే గ్రామ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ భవనంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... దశల వారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు నరేందర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, గిరీష్‌గౌడ్, కుమార్, సురేందర్‌గౌడ్, శివకుమార్, నర్సింహులు, మల్లేష, వెంకట్, కృష్ణ, సుమన్, రమేష్, నరేష్, దేవేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి యాదవ్

షాద్‌నగర్: పట్టణంలోని 22వ వార్డు జయప్రకాష్ నారాయణ కాలనీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కోరుతూ టీఆర్‌ఎస్ నేత నడికూడ యాదగిరి యాదవ్ శుక్రవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వార్డు పరిధిలో చాలా మంది నిరుపేదలు ఉన్నారని, నిత్యం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారని పేర్కొన్నారు. అయితే అనారోగ్యానికి గురైతే ఫరూఖ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వార్డులో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి



ఏఈ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

శంకర్‌పల్లి: స్థానిక క్రిస్టల్ టౌన్ షిప్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆ టౌన్ షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలను ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ కోరారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై శుక్రవారం శంకర్‌పల్లి విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలోని విద్యుత్ తీగలు చిన్న పాటి వర్షానికే తెగి పడుతున్నాయని తెలిపారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, మురారి, సభ్యులు నాగయ్య, శంకర, సాయి తదితరులు పాల్గొన్నారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

సైకాలజిస్ట్ బాలాజీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న బాలాజీ

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ప్రముఖ సైకాలజిస్ట్ బాగి బాలాజీ సూచించారు. శుక్రవారం పట్టణంలోని యూనివర్సల్ మినీ ఫంక్షన్ హాల్‌లో కృష్ణవేణి పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని శ్రమించాలన్నారు. పరీక్షలంటే ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎంఏ సత్తార్, జోనల్ మేనేజర్ వహీద్, ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా, నవీన్ పాల్గొన్నారు.

ఏమరుపాటుగా ఉంటే అంతే..!



కొందుర్గులో గుంతలమయంగా మారిన రోడ్డు

- గుంతలమయంగా షాద్‌నగర్ – పరిగి రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రయాణికులు

కొందుర్గు: షాద్‌నగర్ – పరిగి ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం తప్పదు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గంపల చెరువు వంతెన వద్ద రోడ్డు దెబ్బతింది. గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. ముట్పూర్ ఎంపీటీసీ రామ్‌రెడ్డి మోటర్ సైకిల్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. రంగంపల్లి గేటు వద్ద, ఎలికట్ట వద్ద, శ్రీరంగాపూర్ వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. అయ్యవారిపల్లి వంతెనపై స్లాబ్ సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. కొందుర్గులో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ వద్ద రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

సంఘాల ఏర్పాటు అభినందనీయం

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



పూర్వ విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న కళాశాల సిబ్బంది

మొయినాబాద్: ఉన్నత విద్యా సంస్థల్లో వ్యవస్థాపకత, పని తనాన్ని ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థులతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్(ఎంజీఎన్‌సీఆర్‌ఈ) సహకారంతో స్వయం సహాయక సంఘం ఏర్పాటు చేశారు. కళాశాల పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘం సభ్యులు నిరుపయోగ కాగితాలను ఉపయోగించి ఆకర్షనీయమైన వస్తువులను తయారు చేసి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. వాటిని ప్రస్తుత విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల ద్వారా వ్యవస్థాపకత అభివృద్ధికి ప్రయత్నాలు చేయడం, వారిని ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. పూర్వ విద్యార్థుల నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీలత, ప్రవల్లిక, నందకిషోర్, మనీషా, మానస, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

మొయినాబాద్ రూరల్: మండలంలోని చిన్నమంగళారంలో గ్రామ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఆంజనేయులు తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టోర్నమెంట్‌ను ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు పోటీలు సాగుతాయన్నారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో కేరళ, తమిళనాడుతో పాటు వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కృష్ణారెడ్డి సహకారం ప్రశంసనీయం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేష్ కుమార్

- తహసీల్దార్ రమేష్‌కుమార్
- కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

కొందుర్గు: తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తహసీల్దార్ రమేష్ కుమార్ వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణారెడ్డి సహకారం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ అనీల్‌కుమార్, ఎంఆర్‌ఐలు శివకుమార్, మహేందర్ గౌడ్, కంప్యూటర్ ఆపరేటర్ హరీష్, నాయకులు శ్రీనువాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులది అద్భుతమైన తీర్పు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు అద్భుతమైన తీర్పు ఇచ్చారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించడంతో శుక్రవారం షాద్‌నగర్‌లో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదంటే ఆ పార్టీ నైతికంగా ఓడిపోయిందన్నారు. ఈ తీర్పు బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు లాంటిదన్నారు. అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉందని స్పష్టం అవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నియంతపాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని పేర్కొన్నారు. బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, ఏ బాబయ్య, అశోక్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కే వెంకటేష్ గుప్తా, సీ వెంకటేష్, లష్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం మొయినాబాద్‌లో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో బీజేపీ జైత్రయాత్ర మొదలైందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేష్, శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీపతి యాదవ్, శ్రీకాంత్, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రాంరెడ్డి, మహిపాల్, ఎల్లేష్‌గౌడ్, వినోద్, మణికంఠ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో...

ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఏవీఎన్ రెడ్డి గెలుపొందడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత రెడ్డి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, బీజేవైఎం చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అశోక్, బండారి శేఖర్‌రెడ్డి, కృష్ణమోహన్, శ్రీనివాస్, శేర్వలింగం, మధుసూదన్‌రెడ్డి, హరిలాల్, సత్యం, ప్రశాంత్‌రెడ్డి, దామోదర్‌చారి, రఘు, హనుమంతు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో సంబరాలు

శంకర్‌పల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడంతో శుక్రవారం శంకర్‌పల్లి ప్రధాన కూడలిలో ఆ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, నాయకులు నర్సింహారెడ్డి, నరేష్ కుమార్, నందు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.